వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ కేతన్‌గార్గ్

మార్చి 11న బ్యాలెట్ పేపర్ల పంపిణీ

కలెక్టర్ కేతన్ గార్గ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల బ్యాలెట్ పేపర్ల పంపిణీ మార్చి 11న చేపడతామని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కేతన్ గార్గ్ తెలిపారు. మంగళవారం ఉదయం స్థానిక కలెక్టరేట్‌లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పుట్టపర్తి, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన డీఆర్వోలు, నోడల్ అధికారులతో శాసనమండలి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాలెట్ పేపర్ల ప్రింటింగ్, పంపిణీ అనంతపురం కలెక్టరేట్ నుంచి మార్చి 11వ తేదీ ఉదయం 9గంటల నుంచి ఆయా జిల్లాలకు పంపిణీ చేస్తామన్నారు. చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి ఐదు జిల్లాల నుంచి సంబంధిత జిల్లా ఎన్నికల అధికారి అథారిటీ లెటర్లతో అధికారులను అనంతపురానికి పంపి బ్యాలెట్ పేపర్లను తగిన బందోబస్తుతో తీసుకెళ్లాల్సిందిగా సూచించారు. ఆ తర్వాత ఆ బ్యాలెట్ పేపర్లను ఆయా జిల్లాల నుంచి పోలింగ్ స్టేషన్లకు పంపాల్సి ఉంటుందన్నారు. శాంతి భద్రతలు, బందోబస్తు ఏర్పాట్లను ఆయా జిల్లాల ఎన్నికల అధికారి ఎస్పీలు కలిసి చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ఆయా జిల్లాల ఎన్నికల అధికారులు చేపట్టాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులు, ఇతర ఎన్నికల సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు కూడా వారే ఏర్పాటు చేసుకోవాలన్నారు. బ్యాలెట్ బాక్స్‌ల ప్రొక్యూర్మెంట్, ఇతర ఎన్నికల ప్రక్రియకు సంబంధించి పనులన్నింటినీ ఆయా జిల్లాల ఎన్నికల అధికారులు చేపట్టాలన్నారు. మండలి ఎన్నికలలో ప్రాధాన్యత క్రమాన్ని అనుసరించి ఓటింగ్ చేస్తున్న నేపథ్యంలో పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఏ విధంగా ఓటింగ్ చేయాలో మండలాల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మార్చి 7వ తేదీ లోపు ఓటర్ స్లిప్పులను పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఓటర్ స్లిప్పులు సంబంధిత ఓటర్లకు మాత్రమే బూత్ లెవెల్ అధికారులు ఇచ్చి వారి నుంచి సంతకం తీసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మార్చి 14వ తేదీన అనంతపురంలోని జేఎన్టీయూలో రిసెప్షన్, కౌంటింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని, ఆయా జిల్లాల నుంచి బ్యాలెట్ బాక్స్‌లను తగిన బందోబస్తుతో ఇక్కడికి చేర్చాలన్నారు. కౌంటింగ్‌పై మార్చి 15వ తేదీన శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ గాయత్రిదేవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఓటరు స్లిప్‌లు పంపిణీ

పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఓటర్లకు ఓటర్ స్లిప్పులను బుధవారం నుంచి జారీ చేస్తున్నామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కేతన్ గార్గ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్చి 13వ తేదీన నిర్వహించనున్న కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఓటర్లకు ఓటర్ స్లిప్పులను పంపిణీ చేస్తామన్నారు. సంబంధిత విఆర్ఒ లేదా బూత్ స్థాయి అధికారుల నుంచి ఓటర్ స్లిప్స్ పొందాలని ఓటర్లకు సూచించారు.

ఎలా పట్టుకోవాలి..?



- పట్టభద్రుల ఓట్ల కోసం గాలం
- ప్రధాన పార్టీల కసరత్తు
- ఓటుకు రెండు వేలు పెట్టాలి
- ఉపాధ్యాయులకు ఐదు వేలు...
- అంతర్గత చర్చలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మండలి ఎన్నికలకు నామినేషన్ల ఘట్టం పూర్తయ్యింది. మంగళవారం నుంచి ప్రచారాలు ప్రారంభం అయ్యాయి. ప్రచారాల హోరు ఒకవైపు సాగుతున్న క్రమంలోనే పట్టభద్రులను ఏ రకంగా ప్రలోభ పెట్టవచ్చు అన్న దానిపైనా ప్రధాన పార్టీలు దృష్టి సారించాయి. ఈ మేరకు ముఖ్య నేతల సమావేశాలు నిర్వహిస్తున్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సోమవారం నాడు జిల్లాకు విచ్చేసి ముఖ్య నేతల సమావేశాలను నిర్వహించారు. ఇందులో నియోజకవర్గాల వారీగా ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై కసరత్తు చేసినట్టు సమాచారం. ఇక టిడిపి కూడా నియోజకవర్గాల వారీగా నేతలు ఓటర్లను గుర్తించే పనిని చేపట్టారు. పట్టభద్రులకు మొత్తం 49 మంది అభ్యర్థులు బరిలోనున్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గాలకు 12 మంది అభ్యర్థులు బరిలోనున్నారు. పట్టభద్రుల నియోజకవర్గానికి 1.30 లక్షల ఓట్లు ఉండగా, ఉపాధ్యాయ నియోజకవర్గానికి 30 వేల ఓట్లు ఉన్నాయి. ఇందులో సగానికిపైగా ఓట్లు పోలయ్యే అవకాశముంది. వీరిని గుర్తించి వారిని ఏ రకంగా ప్రలోభ పెట్టవచ్చు... దానికయ్యే బడ్జెట్ ఎంత..? అన్నది కూడా ప్రధానపార్టీల్లో చర్చలు నడిచినట్టు సమాచారం.

పట్టభద్రులకు రెండు వేలు... ఉపాధ్యాయులకు ఐదు వేలు ...

పట్టభద్రులకు సంబంధించి ఓటుకు రెండు వేల రూపాయల చొప్పున ఇవ్వాలన్నదే సోమవారం జరిగిన ఒక ప్రధాన పార్టీ అంతర్గత చర్చల్లో వచ్చినట్టు సమాచారం. పార్టీ నుంచి ఇవ్వబోమని, అభ్యర్థే ఈ ఖర్చును పెట్టుకోవాల్సి ఉంటుందన్న చర్చ కూడా వచ్చినట్టు తెలుస్తోంది. ఇక ఉపాధ్యాయ నియోజకవర్గానికి వచ్చే సరికి ఓటుకు రూ.ఐదు వేల వరకు అయినా ఇవ్వాలని ముఖ్య నేతలు సూచనలు చేసినట్టు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. దీన్ని ఏ రకంగా పంపిణీ చేయాలన్న దానిపైనా కసరత్తు ప్రారంభమైంది. ఇప్పటికే ఉపాధ్యాయ నియోజకవర్గాలకు ఇప్పటికే ట్రయిల్ రన్‌గా టిఫిన్ బాక్సులు పంపిణీ చేశారు. ఇది ఉపాధ్యాయుల్లోనున్న వ్యతిరేకతను అంచనా వేయడంలో భాగంగా అధికారపార్టీ ఒక అంచనా వేసినట్టు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఉపాధ్యాయ నియోజకవర్గాలకు సంబంధించి ఈసారి ప్రయివేటు ఉపాధ్యాయుల సంఖ్య ప్రభుత్వ ఉద్యోగులకు సమానంగా ఓట్లు ఉన్నాయి. వీటిని ఏ రకంగా పట్టుకోవాలి, వాటిని తమవైపు మలుచుకునేందుకు అవసరమైన ఎత్తులు వేస్తున్నారు. తక్కువ ఓట్లు కావడంతో డబ్బులను పెద్దఎత్తున పంపిణీకి సిద్ధపడుతున్నట్టు ప్రచారం సాగుతోంది.

విద్యార్థినులతో కలిసి నిరసన తెలుపుతున్న ఐద్వా, ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యార్థిని ప్రీతి మృతి బాధాకరం

- కారకులను కఠినంగా శిక్షించాలి
- ఐద్వా ఆధ్వర్యంలో మానవహారం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

వైద్య విద్యార్థిని ప్రీతి మృతి అత్యంత బాధాకరమని, ఆమె మరణానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి డిమాండ్ చేశారు. ఐద్వా, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థిని ప్రీతికి సంతాపం తెలియజేశారు. మంగళవారం నాడు నగరంలో నలంద కళాశాల విద్యార్థినిలతో కలిసి రైల్వే స్టేషన్ వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రీతిని మూడు నెలలుగా సీనియర్లు వేధించారన్నారు. మెడికల్ కళాశాల హెచ్ఒడి, ప్రిన్సిపల్‌కు విన్నవించుకున్నా ఏమాత్రం స్పందించ లేదని విద్యార్థిని తల్లి వాపోయిందన్నారు. కళాశాల సిబ్బంది ర్యాగింగ్‌కు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుని ఉంటే ప్రీతికి మృతి చెందేది కాదన్నారు. ర్యాగింగ్ పాల్పడిన వారందరి డాక్టర్ పట్టాలు రద్దు చేసి, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ర్యాగింగ్‌కు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి రాజేశ్వరి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరులపై కేసులు ఎత్తేయండి : సిపిఎం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

శ్రీసత్యసాయి జిల్లా కదిరిలో నలుగురు పాత్రికేయులపై నమోదైన అక్రమ కేసులను వెంటనే తొలగించాలని, విలేకరులను దుర్భాషలాడి అతిగా ప్రవర్తించిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం నాడు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ఓ ప్రకటన విడుదల చేశారు. బాధ్యతగా వ్యవహరించాల్సిన సిఐ ప్రవర్తన శాంతి భద్రతలకు విఘాతం కలిగేందుకు కారణమయ్యారని విమర్శించారు. తమ విధులను నిర్వహిస్తున్న విలేకరుల సెల్ ఫోన్లు లాక్కున్న పోలీసులు, వారిపై కేసులు పెట్టడం సరికాదన్నారు. జరిగిన సంఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

సచివాలయం తనిఖీ

పుట్లూరు : మండల పరిధిలోని బాలాపురం సచివాలయాన్ని ఎంపిడిఒ యోగానందరెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా మూమెంట్ రిజిస్టర్ పరిశీలించి వేలిముద్ర వేశారా..లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయం సిబ్బందితో మాట్లాడుతూ వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా.. లేదా.. అని తెలుసుకున్నారు. ఇంట్లో కుటుంబ సభ్యులను ఎప్పటికప్పుడు యాప్‌లో అప్‌లోడ్ చేస్తూ ఉండాలన్నారు. అదేవిధంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఓ యోగానందరెడ్డి

మైరెడ్డి నీరజ సేవలు అభినందనీయం

ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ పదవీవిరమణ
పెద్దాసుపత్రి వైద్య పర్యవేక్షకుడు రఘునందన్

ప్రజాశక్తి-అనంతపురం

22 సంవత్సరాలు అనంతపురం వైద్య కళాశాలలో తన ఉద్యోగ జీవితాన్ని గడపడంతోపాటు 8ఏళ్లకు పైగా ప్రిన్సిపాల్‌గా డాక్టర్ మైరెడ్డి నీరజ అందించిన సేవలు మరువలేనివని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వైద్య పర్యవేక్షకుడు రఘునందన్ కొనియాడారు. ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మైరెడ్డి నీరజ పదవీ విరమణ సందర్భంగా మంగళవారం కళాశాలలోని ఆడిటోరియంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరజ ఎంతో నిజాయితీగా, నిబద్ధతతో, ఓపికతో అందర్నీ సమన్వయం చేసుకుని ఎనిమిదిన్నర సంవత్సరాల పాటు ఒక పెద్ద మెడికల్ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా పనిచేయడం అభినందనీయమన్నారు. ఆమె విధులు అందరికీ స్ఫూర్తి అన్నారు. మైరెడ్డి నీరజ మాట్లాడుతూ తన జీవితంలో ఎక్కువ భాగం ఉద్యోగ జీవితాన్ని ఈ కళాశాలలోని చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. ఒక మంచి టీంతో కలిసి పని చేసినందుకు చాలా గర్వపడుతున్నానన్నారు.. జీవితంలో వచ్చే ప్రతి ఆటుపోట్లను సమర్థవంతంగా ఎదుర్కొని మన ఉద్యోగ ధర్మాన్ని పాటించాలని సూచించారు. అనంతరం వైద్యులు, మెడికల్ ఉపాధ్యాయేతర సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్లు, మినిస్టీరియల్ స్టాఫ్, తదితరులు నీరజను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షులు డాక్టర్ రామస్వామి నాయక్, వైస్ ప్రిన్సిపాళ్లు ఆరేపల్లి శ్రీదేవి, కెఎల్ సుబ్రహ్మణ్యం, షారోన్ సోనియా, ప్రముఖ ఆర్థోపెడిషియన్ భానుకిరణ్, నవీన్ అహ్మద్, డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్, డాక్టర్ ఏపీఎన్ రావు, అన్ని విభాగాల హెచ్ఒడిలు, వైద్య ఉపాధ్యాయులు, డాక్టర్లు వైఎంఎస్ ప్రసాద్, జగన్మోహన్‌రెడ్డి, శ్రీనివాసరావు, భవాని, శ్రీదేవి, పద్మ శ్రావణి, విజయకుమారి, శ్రావణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి, పరదేశీనాయుడు తదితరులు పాల్గొన్నారు

ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ మైరెడ్డి నీరజను సన్మానిస్తున్న ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వైద్య పర్యవేక్షకుడు రఘునందన్, తదితరులు

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచాలి

జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

నూతన సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన పెంచినప్పుడే అవకాశాలు అందిపుచ్చుకుంటారని జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన సూచించారు. మంగళవారం స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్, కమ్యునికేషన్ ఇంజినీరింగ్ విభాగం బెంగళూరు సి.డాక్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ సుజాత అధ్యక్షతన ఐదు రోజులు నిర్వహించనున్న వర్కుషాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఇలాంటి వర్క్‌షాపును నిర్వహించడం వల్ల విద్యార్థులు విజ్ఞానాన్ని మరింత పెంపొందించుకునే అవకాశం ఉందన్నారు. విద్యార్థులకు లేటెస్ట్ టెక్నాలజీపై శిక్షణ ఇస్తే వారు మరింత ముందుకు వెళ్లే అవకాశం ఉందన్నారు. గౌరవ అతిథి ఐ ఇఇఇ విభాగం ప్రమోద్ మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి వర్క్‌షాపును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా హ్యాండ్స్ ఆఫ్ ఎక్స్‌పీరియన్స్ ట్రైనింగ్ ఇవ్వడం వల్ల విద్యార్థులకు ప్రాక్టికల్ విజ్ఞానాన్ని పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమానికి కన్వీనర్‌గా విష్ణువర్ధన్, కోఆర్డినేటర్‌గా మమత వ్యవహరించారు. ఈకార్యక్రమంలో సి-డాక్ బెంగళూరు బృందం, వైస్ ప్రిన్సిపాల్ భవానీ, వి.సుమలత, పి.ఆర్.భానుమూర్తి, పి.రమణారెడ్డి, బోధన సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన

'రైతు భరోసా' అందజేత

జిల్లా వ్యాప్తంగా రూ.59.11కోట్ల లబ్ధి

పిఎం కిసాన్, రైతు భరోసా మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ కేతన్‌గార్గ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టర్

జిల్లా రైతులకు రైతు భరోసా, పిఎం కిసాన్ సాయాన్ని అందజేశారు. అనంతపురం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వైస్సార్ రైతు భరోసా – పిఎం కిసాన్ కింద 2,83,229 మంది రైతులకు రూ.59.11 కోట్ల రూపాయలను రైతులకు పంపిణీ చేశారు. మాండోస్ తుపాన్ ప్రభావం వల్ల నష్టం పోయిన 241 మంది రైతులకు రూ.26.70 లక్షలను అందించారు. ఇందుకు సంబంధించిన మెగా చెక్‌ను కలెక్టర్ కేతన్‌గార్గ్ రైతులకు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్‌తో పాటు వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో రాజకీయాలా..!

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

పేదల పింఛన్ల పంపిణీలో కూడా వైఎస్‌ఆర్‌సిపి రాజకీయం చేస్తూ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి ఉపయోగించుకోవడం దుర్మార్గమని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా రాష్ట్ర ప్రభుత్వం వైఎస్‌ఆర్‌సిపి పదేపదే ఎన్నికల కోడ్ ఉల్లంఘించి ఓటర్లను ప్రభావితం చేయడానికి యత్నాలు కొనసాగిస్తూనే ఉందన్నారు. ఈ అక్రమ పద్ధతులను అడ్డుకోవడంలో ఎన్నికల కమిషన్ విఫలమైందన్నారు. మార్చి 1 నుంచి 3వ తేదీల వరకు నిర్వహించే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సిపి మండల ఇన్‌ఛార్జులు, వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు (వైఎస్‌ఆర్‌సిపి క్షేత్రస్థాయి కార్యకర్తలు) పాల్గొనాలని శాసనసభ్యులకు సమాచారం పంపారని తెలిపారు. పింఛను పంపిణీ చేసేప్పుడు పార్టీ కేడర్ అంతా పాల్గొని ప్రతి లబ్ధిదారులతో ఫొటో తీసుకుని జెసియస్ మండల వాట్సాప్ గ్రూపులో పోస్ట్ చేయాలని ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ఎన్నికల కోడ్‌ను లెక్క చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ఓటర్లను ప్రభావితం చేయడానికి విశ్వప్రయత్నం చేస్తోందన్నారు. గతవారం రోజుల్లో అధికారపార్టీ కోడ్ ఉల్లంఘనలకు పాల్పడుతోందన్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా తన ప్రచార కార్యక్రమాలు చేసుకుంటూ పోతోందన్నారు. ఇప్పటికైనా ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకుని ఎన్నికల కోడ్ పటిష్టంగా అమలు జరిగేలా చర్యలు తీసుకుని, ఎన్నికలు స్వేచ్ఛగా జరిగేందుకు వీలు కల్పించాలని కోరారు.

కుల,మతాలకు అతీతం..సూఫీ సిద్ధాంతం..

సీనియర్ రచయిత డాక్టర్ రమేష్‌నారాయణ

ప్రజాశక్తి-అనంతపురం

సూఫీ సిద్ధాంతాన్ని మించిన మతమేదీ లేదని, జాతి, కులమతాలకతీతంగా మహాకవి డాక్టర్ ఉమర్ ఆలీషా సృజియించిన సాహిత్యం సర్వశ్రేష్ఠంగా విరాజల్లుతోందని పలువురు వక్తలు కొనియాడారు. విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం షష్టమ పీఠాధిపతులు డాక్టర్ ఉమర్ ఆలీషా జయంతిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక ఎస్ఆర్ ఎడుకేషనల్ సొసైటీ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ రచయిత డాక్టర్ పతికి రమేష్‌నారాయణ మాట్లాడుతూ ఉమర్ అలీషా సాహిత్యాన్ని జిల్లాలో విస్తృతం చేయడానికి కషి చేస్తున్నట్లు తెలిపారు. కేవలం సాహిత్యం మాత్రమే కాకుండా మానవతా విలువలను బోధించిన సద్గురువుల విశిష్ట వ్యక్తిత్వాన్ని తెలిపే జయంతి, వర్ధంతులు, సేవా కార్యక్రమాలను స్ఫూర్తిదాయకంగా నిర్వహించాలని తీర్మానించారు. 2013 నుంచి 2023 వరకు ఉమర్ సాహిత్యంపై సాగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అనంతవాసులు చూపిన ప్రతిభను ప్రత్యేకంగా గుర్తు చేసుకుంటూ రానున్న రోజుల్లో మరింత మంది అనంత ఖ్యాతిని ఘనంగా చాటుతారన్న విశ్వాసాన్ని వెలిబుచ్చారు. ఈ సందర్భంగా భూమిపుత్ర గ్లోబల్ మీడియా వారు ఉమర్ అలీషా సాహిత్యంపై ప్రచురించిన వ్యాసాలను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉమర్ ఆలీషా సాహితీ సమితి అధ్యక్షులు రియాజుద్దీన్ అహ్మద్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత చింతా వేంకటేశ్వర్లు, రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు సాకే శ్రీహరిమూర్తి, ఉమర్ ఆలీషా సాహితీ సమితి ప్రధాన కార్యదర్శి గుంటి మురళీకృష్ణ భరద్వాజ్, డాక్టర్ నగరూరు రసూల్, కార్యదర్శి సుంకర రమేష్, శ్రీకాంత్, గోపాల్ రాయల్, నందిత, నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం షష్టమ పీఠాధిపతులు డాక్టర్ ఉమర్ ఆలీషా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా ముమ్మర ప్రచారం

ప్రజాశక్తి-రాయదుర్గం

పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థులకు మద్దతుగా సిపిఎం, సిఐటియు నాయకులు మంగళవారం రాయదుర్గంలో ప్రచారం ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు, రాష్ట్ర నాయకులు వి.రాంభూపాల్, తదితరులు హాజరై ప్రభుత్వ కార్యాలయాలు, ప్రయివేటు విద్యా సంస్థలకు వెళ్లి ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజ సంక్షేమం కోసం పోరాటాల చేసే పిడిఎఫ్ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి బలరంగయ్య, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ, స్థానిక సిఐటియు నాయకులు తిమ్మరాజు, మధు, రమేష్ ఎస్ఎఫ్ఐ నాయకులు వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిని గెలిపించాలని మంగళవారం మండల కేంద్రంలో సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల సమీపంలో ఓటర్లను కలుసుకుని ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, ఎన్‌పిఆర్‌డి జిల్లా కార్యదర్శి రామయ్య, సిపిఎం మండల కార్యదర్శి శివశంకర్, సిఐటియు జిల్లా కమిటీ సభ్యురాలు జయమ్మ, ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు రాజేశ్వరమ్మ, ఐద్వా మండల కార్యదర్శి సరస్వతమ్మ, చౌడప్ప, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు నాయకులు

శింగనమల : ప్రజా సమస్యలపై గళమెత్తి ప్రశ్నించే వ్యక్తికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయాలని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ కోరారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల సమీపంలో ఓటర్లను కలుసుకుని ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 32 సంవత్సరాలుగా అనేక ఉద్యమాల్లో భాగస్వామ్యం వహించడంతోపాటు ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తిని వదులుకున్నారన్నారు. అంతేగాకుండా విద్యార్థి నాయకుడిగా, సామాజిక కార్యకర్తగా, వెనుకబడిన కులాల ఐక్యవేదిక కన్వీనర్‌గా, మహాత్మా పూలే ఛారిటబుల్ ట్రస్టు నిర్వాహకునిగా పోతుల నాగరాజు ఎన్నో సేవలు చేస్తున్నారన్నారు. అలాంటి వ్యక్తిని గెలిపిస్తే చట్టసభల్లో ప్రజా గొంతుకను వినిపిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, మునెప్ప, కేశప్ప, కృష్ణమూర్తి, నల్లప్ప, కుమార, నాగేంద్ర, శంకర, నరసింహ, రత్నక్క, చంద, శ్రీనివాసులు, ఎర్రిస్వామి, నాగేంద్ర, పెద్దన్న, ప్రభాస్, పుల్లన్న, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ అభ్యర్థులు కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజుకు మద్దతుగా వామపక్షాలు, ప్రజా సంఘాల నాయకులు మంగళవారం మండలంలో ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా నార్పల, కేశేపల్లిలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో అధ్యాపకులు, పట్టభద్రులను కలిసి పిడిఎఫ్ బలపరుస్తున్న అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.చిన్నప్పయాదవ్, చేనేత కార్మిక సంఘం జిల్లా సబ్ కమిటీ సభ్యుడు నేసే మధు, రైతుసంఘం నియోజకవర్గ సహాయ కార్యదర్శి మారుతీ, సిపిఐ మండల సహాయ కార్యదర్శి గంగాధర్, రైతుసంఘం మండల అధ్యక్షులు జోసెఫ్, లలితమ్మ, బాలాజీ, సంజీవరాయిడు, ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : పశ్చిమ రాయలసీమ స్థానానికి పిడిఎఫ్ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థులు కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజుకు ప్రథమ ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు, రాష్ట్ర

కళ్యాణదుర్గంలో ఓట్లు అభ్యర్థిస్తున్న సిఐటియు నాయకులు నాయకులు

నాయకులు రాంభూపాల్ కోరారు. మంగళవారం పట్టణంలోని వివిధ పాఠశాలలు, బార్‌కౌన్సిల్ సభ్యులను నేరుగా కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల కోసం తమ గొంతుకను వినిపించే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్, జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్ ప్రసాద్, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, నరసింహులు, రంగనాథ్, ప్రభాకర్, నాగరాజు, తిప్పేస్వామి, వన్నూరుస్వామి, వంశీ, రఫీ, ఉదయ్, ఆదర్శ, దనుష్ తదితరులు పాల్గొన్నారు.

శింగనమలలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

నేరాలు ఘోరాలు

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

అరుణ్‌కుమార్ (పాతచిత్రం)

నార్పల : మండల కేంద్రంలోని ఉయ్యాలకుంటలో నివాసం ఉండే అంకన్న కుమారుడు అరుణ్ కుమార్ (18) ఇంట్లో ఎవరూ లేని సమయంలో మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అరుణ్‌కుమార్ నార్పల జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రాఘవరెడ్డి వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియలేదు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గడ్డివామి దగ్ధం

పుట్లూరు : మండల పరిధిలోని ఎ.కొండాపురం గ్రామంలో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తులు సొప్పవామికి నిప్పు పెట్టడంతో సుమారు 15 ట్రాక్టర్ల చొప్ప వామి దగ్ధమైంది. దీంతో రూ.లక్ష వరకు నష్టం వాటిలినట్లు రైతు పరిగి మోహన్‌కుమార్ నాయుడు వాపోయాడు. వెంటనే అగ్ని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపు చేసినట్లు రైతు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

స్టాక్ పాయింట్‌లో అగ్నిప్రమాదం

రూ.20 లక్షలు నష్టం

గుంతకల్లు : పట్టణ శివారులోని ఆలూరు రోడ్డు ప్రశాంతినగర్ కాలనీలో ఉన్న స్పైకి ట్రేడర్స్ స్టాక్ పాయింట్ గోడౌన్‌లో మంగళవారం చోటు చేసుకున్న విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదంలో రూ.20 లక్షలు నష్టం జరిగినట్లు గోడౌన్ యజమాని విజి. శ్రీనివాసులు తెలిపారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు... విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. గమనించిన చుట్టుపక్కల వారు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే ఫైర్ అధికారి లింగమయ్య సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో ఫోమ్, వుడ్, రబ్బర్, మ్యాట్, కంప్రెషర్ ఇతర సామాగ్రి ఉన్నట్లు తెలిపారు. దీంతో దాదాపు రూ.20 లక్షల నష్టం వాటిల్లినట్లు తెలిపారు.

'యువగళం'లో శింగనమల టిడిపి నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

చంద్రగిరి నియోజకవర్గం అయితేపల్లి గ్రామంలో సాగుతున్న నారా లోకేష్ యువగళం పాదయాత్రలో మండలానికి చెందిన టిడిపి అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి బాట పట్టాలంటే మళ్లీ చంద్రబాబు సిఎం కావాలన్నారు. అంతేగాకుండా యువళం పేరుతో నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రకు విశేష స్పందన వస్తోందన్నారు. దీన్ని చూసి వైసిపి ప్రభుత్వం ఓర్చుకోలేక అడ్డుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా లోకేష్ పాదయాత్ర పూర్తి చేసి తీరుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు నాగరాజు, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ మాసుల చంద్రమోహన్, పెద్ద నాగముని, బీసీ సెల్ జిల్లా నాయకులు బ్యాళ్ల నాగేంద్ర, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు నరేంద్రకుమార్ యాదవ్, జిల్లా బీసీ సెల్ కార్య నిర్వాహ కార్యదర్శి కొయగూర పెద్దన్న, మాజీ ఎంపిటిసి చంద్రాయుడు, నియోజకవర్గ బీసీ సెల్ కార్యదర్శి లోలూరు నారాయణస్వామి తరిమెల చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

లోకేష్‌తో కలిసి నడుస్తున్న శింగనమల టిడిపి నాయకులు

శిక్షణ ద్వారా అధ్యాపకులు పట్టు సాధించాలి

జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

జెఎన్‌టియు పరిధిలోని అధ్యాపకులు తప్పనిసరిగా ఆర్టిఫిసియల్ ఇంటలిజెన్స్‌పై పట్టు సాధించాలని ఉపకులపతి రంగజనార్ధన సూచించారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్సు విభాగం, ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐఎస్‌టిఇ) సంయుక్త ఆధ్వర్యంలో ఆర్టిఫిషయల్ ఇంటలిజెన్స్‌పై ఏర్పాటు చేసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని విసి ప్రారంభించారు. ముందుగా సర్ సివి రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి వర్క్‌షాపుల వల్ల అధ్యాపకులు వారి విజ్ఞానాన్ని మరింత పెంపొందించుకోవచ్చునని తెలిపారు. ముఖ్యంగా కంప్యూటర్ సైన్సు విభాగంలో అనేక ఇంజినీరింగ్ బ్రాంచులు ప్రవేశ పెట్టారని, వాటిలో భోదిస్తున్న అధ్యాపకులకు ఇటువంటి శిక్షణ తరగతులు ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్శిటీ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ డైరెక్టర్ బి.ఈశ్వర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ పి.సుజాత, కె. మాధవి, ఎపి.శివకుమార్, ఉపకులపతి ఓఎస్డీ దేవన్న, పి.ఆర్.భానుమూర్తి, బోధన సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

సర్ సివి.రామన్‌కు నివాళులర్పిస్తున్న జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన, సిబ్బంది

ఉరవకొండ సుందరీకరణ పనులు భేష్ : మంత్రి ఉషశ్రీచరణ్

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ మేజర్ పంచాయతీ సుందరీకరణలో భాగంగా చేస్తున్న అభివృద్ధి పనులు బాగున్నాయని మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. ఇందులో భాగంగా మంగళవారం పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్‌లో చేపట్టిన హైమాక్స్ లైట్ల ఏర్పాటు పనులను మంత్రితోపాటు మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, నియోజకవర్గ పరిశీలకులు శ్రీనివాసులు తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులు చేపట్టిన సర్పంచ్ మీనుగ లలితను అభినందించారు. మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చందా చంద్రమ్మ, జెడ్పిటిసి ఏసీ పార్వతమ్మ, కూడేరు ఎంపిపి నారాయణరెడ్డి, వజ్రకరూరు సర్పంచి మొనాలిసా, నాయకులు తుప్పటి హరీష్, మీనుగా బసవరాజు, ఏసీ ఎర్రిస్వామి, ఓబన్న, వార్డు సభ్యుడు శర్మస్, చంగల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్‌రెడ్డి, తదితరులు



గవిమఠంలోను సందర్శించిన మంత్రి ఉషశ్రీ చరణ్, మాజీ ఎమ్మెల్యే విశ్వ, ఎమ్మెల్సీ మంగమ్మ

గవిమఠంలో ప్రముఖుల పూజలు

ప్రజాశక్తి-ఉరవకొండ

ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన ఉరవకొండలోని కరిబసవేశ్వర గవిమఠాన్ని మంత్రి ఉషశ్రీచరణ్, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, తదితరులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం గవిమఠం విశిష్టత, చరిత్ర గురించి అర్చకులను అడిగి మంత్రి తెలుసుకున్నారు. అంతకముందు గవిమఠం అధికారులు, అర్చకులు అతిథులకు ఘనస్వాగతం పలికారు. అనంతరం గవిమఠం 8వ పీఠాధిపతులు శ్రీ జగద్గురు చెన్నబసవ రాజేంద్రస్వామిని కలిసి ఆశీస్సులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో గవిమఠం సహాయ కమిషనర్ చిట్టెమ్మ, సర్పంచి మీనుగా లలితమ్మ, ఎంపిపి చందా చంద్రమ్మ, జడ్పీటీసీ పార్వతమ్మ, విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పావతి, వజ్రకరూరు సర్పంచి మొనలిసా, ఇతర నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

జగన్ పాలనలో లోపించిన పారదర్శకత

మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సిఎం జగన్ పాలనలో పారదర్శకత లోపించిందని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు అన్నారు. పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ అభ్యర్థి టిడిపి అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాలరెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల్లో ఓటర్లను కలుసుకుని అభ్యర్థించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సహజ వనరులు, ప్రజల సొమ్మును దోచుకుతినడానికే వైసిపి నాయకులు అధికారంలోకి వచ్చినట్లుందని విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడి, అరాచకం రాజ్యమేలుతోందన్నారు. గాడితప్పిన వ్యవస్థలను చక్కదిద్దే శక్తి ఒక్క చంద్రబాబుకే ఉందన్నారు. జగన్ దుష్ట పాలనపై మేథావులు సంధించే తొలి అస్త్రం ఎమ్మెల్సీ ఓటే కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం, రాష్ట్ర చేనేత మాజీ డైరెక్టర్ టంకశాల హనుమంతు, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు వెంకటేశులు, ఎస్సీ సెల్ మలికార్జున, మైనార్టీ సెల్ జిలాన్, తిప్పేస్వామి, సిద్ధన్న పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

ప్రజాశక్తి-అనంతపురంసిటీ

నగరంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను (న్యూటౌన్) జిల్లా విద్యాశాఖ అధికారి యం.సాయిరాం మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా 8వ తరగతి విద్యార్థులు బైజూస్ ట్యాబులను వినియోగిస్తున్నారా? లేదా? అని ఆరాతీశారు. అయితే పలువురు విద్యార్థులు సరిగ్గా వినియోగించకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ ట్యాబులను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని హెచ్ఎంను ఆదేశించారు. అలాగే చాలామంది విద్యార్థులు షూలు వేసుకురావకపోవడాన్ని గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా టీచర్ల డైరీలు, విద్యార్థుల నోటుబుక్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం డిప్యూటీ డిఇఒ పద్మప్రియ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

గవిమఠం పీఠాధిపతి చెన్నబసవ రాజేంద్రస్వామి

ప్రజాశక్తి-ఉరవకొండ

క్రీడలు మానసిక ఉల్లాసంతోపాటు స్నేహ సంబంధాలను పెంచుతాయని గవిమఠం పీఠాధిపతి చెన్నబసవ రాజేంద్రస్వామి తెలిపారు. గవిమఠం చంద్రమౌళేశ్వరిస్వామి రథోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్‌కెఆర్ క్లబ్ నిర్వాహకులు మంగళవారం ఏర్పాటు చేసిన షటిల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌కెఆర్ క్లబ్ వారు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం సంతోషకరమన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో గవిమఠం ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్రస్వామి, ఉరవకొండ ఎస్ఐ వెంకటస్వామి, క్లబ్ కార్యదర్శి శివప్ప, ఉపాధ్యక్షులు నాగరాజు, క్లబ్ సభ్యులు. క్రీడాకారులు పాల్గొన్నారు.

షటిల్ టోర్నమెంట్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న గవిమఠం పీఠాధిపతి చెన్నబసవ రాజేంద్రస్వామి

15లోగా ఇకెవైసి చేయించుకోండి

కళ్యాణదుర్గం : మండల పరిధిలోని చాపిరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఓటుహక్కు ఉన్న రైతులు మార్చి 15వతేదీలోగా ఈకేవైసీ చేయించుకోవాలని కమిటీ సభ్యులు వెంకటేశులు, శివలింగారెడ్డి, రామాంజినేయులు, సిఇఒ నారాణస్వామి, వెంకప్ప మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం ఆధార్, రేషన్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా బుక్ జిరాక్స్‌తోపాటు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలను తీసుకురావాలని కోరారు.

ఉపాధి పనుల పరిశీలన

పుట్లూరు : మండల పరిధిలోని పుట్లూరు, బాలాపురం పంచాయతీల్లో చేస్తున్న ఉపాధి పనులను ఎంపిడిఒ యోగానందరెడ్డి మంగళవారం పరిశీలించారు. ముందుగా మస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏమైనా సమస్యలు ఉన్నాయా.. అని కూలీలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ చెన్నకేశవులు, ఇసి విజయ, నాగేందర్‌రెడ్డి, బిఎఫ్ టి.రామాంజనేయులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

కూలీలతో మాట్లాడుతున్న ఎంపిడిఒ యోగానందరెడ్డి

ఫ్యాక్షన్ రూపుమాపేందుకు కృషి : ఎమ్మెల్యే పెద్దారెడ్డి

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

నియోజకవర్గంలో గతంలో జెసి సోదరులు ఫ్యాక్షన్‌ను పోషించి ప్రోత్సహిస్తే.. తాను అధికారంలోకి వచ్చాక ఫ్యాక్షన్‌ను పూర్తిగా రూపుమాపేందుకు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తెలిపారు. రైతు సంక్షేమం, ప్రజా సంక్షేమ యాత్ర రెండో విడుత మంగళవారం మండలంలోని ముచ్చుకోట నుంచి ప్రారంభమైంది. అక్కడి నుంచి వరదాయపల్లి, అమ్మలదిన్నె, కొత్తపల్లి గ్రామాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో స్థానికులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జెసి సోదరులు గతంలో ప్రతి గ్రామంలో ఫ్యాక్షన్‌ను ప్రోత్సహించారని ఆరోపించారు. అయితే తాను వచ్చాక ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి ఫ్యాక్షన్‌ను పూర్తిగా రూపుమాపేందుకు చర్యలు తీసుకుంటున్నానన్నారు. ఇందులో భాగంగా తాను గెలిచిన తర్వాత ముచ్చుకోట, చాగల్లు రిజర్వాయర్లకు పుష్కలంగా నీరు తెచ్చానన్నారు. ఆయా రిజర్వాయర్లకు నీరు రావడంతో గ్రామాల్లో భూగర్భజలాలు పెరిగి రైతులు సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. ఇందుకు సిఎం జగన్ అందిస్తున్న సహకారమే అన్నారు. ఇకపోతే ప్రజా సంక్షేమమే జగనన్న పాలన సాగుతోందన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. అంతేగాకుండా వాలంటరీ, సచివాలయ వ్యవస్థల ద్వారా నేరుగా ప్రజల వద్దకే సంక్షేమం అందుతోందన్నారు. ఎవరికైనా సంక్షేమ పథకాలు రాకుంటే నేరుగా ఇళ్ల వద్దే తెలుసుకుని అందజేస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ సంక్షేమ పథకాలన్నీ ఇలాగే అందాలంటే మళ్లీ జగన్‌ను సిఎంను చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసిపి నాయకులు కొణిదెల రమేష్‌నాథ్‌రెడ్డి, జడ్పిటిసి రమాదేవి, జాతీయ ఉపాధి హామీ పథకం సభ్యుడు వేమనాథరెడ్డి, అమ్మలదిన్నె సర్పంచి గౌతమి రామచంద్రారెడ్డి, పెద్దపప్పూరు మండలాధ్యక్షుడు రామ్మూర్తిరెడ్డి, ఉపాధ్యక్షులు రామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవిప్రసాద్‌రెడ్డి, అశ్వర్థ నారాయణస్వామి దేవస్థానం ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డి, రమేష్‌రెడ్డి, శివారెడ్డి, రాము, అమర్నాథ్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఎంపిటిసి అనిల్‌కుమార్‌రెడ్డి, అధ్యక్షులు అమర్నాథ్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, యోగేశ్వర్‌రెడ్డి, తదితర వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

ఆప్కాస్‌లో చేర్చినందుకు కృతజ్ఞతలు

అనంతపురం కలెక్టరేట్ : శ్రీసత్యసాయి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా పని చేస్తున్న వారిని ఆప్కాస్‌లో చేర్చడంపై సాంఘిక సంక్షేమ శాఖ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు సిఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.తిప్పయ్య, టి.ముత్యాలప్ప, గౌరవాధ్యక్షులు ఎస్.రవీంద్ర, కోశాధికారి వై.శేఖర్, ఉపాధ్యక్షులు ఎం.మల్లేష్ హర్షం వ్యక్తం చేశారు. 44 మంది కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఆప్కాస్‌లో చేర్చడం సంతోషంగా ఉందన్నారు.

చేనేతకు నిధులు కేటాయించాలని వినతి

రాయదుర్గం : చేనేత రంగానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.2వేల కోట్లు కేటాయించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాయదుర్గం పట్టణ అధ్యక్షులు జి.మధు ఆధ్వర్యంలో మంగళవారం సచివాలయ అధికారులకు విన్నవించారు. ఇందులో భాగంగా పట్టణంలోని 1, 4, 18, 17వ సచివాలయాల్లో అడ్మిన్లను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కార్మిక సంఘం పట్టణ కమిటీ సభ్యులు ఎం.వీరేష్, శ్రీరాములు, అంజి, నాగరాజు, కేశవ, పి.నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివి

కార్మికులకు దుస్తులు అందజేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ శివప్రసాద్

ఉరవకొండ : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివని హెడ్‌కానిస్టేబుల్ శివప్రసాద్ కొనియాడారు. ఉరవకొండలో ప్రసిద్ధి చెందిన గవిమఠం చంద్రమౌళీశ్వర స్వామి రథోత్సవం సందర్భంగా ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న 10 మంది కార్మికులకు హెడ్ కానిస్టేబుల్ ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల చేస్తున్న సేవలు చూసి ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

3న శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్టాపన

గుత్తి : మండలంలోని కొత్తపేట గ్రామంలో సమీపంలో మండల యాదవ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ మందిరంలో మూడు రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వైస్ ఎంపిపి ఎస్.తిరుపాలమ్మ వైసిపి బీసీ సెల్ మండల అధ్యక్షుడు ఎస్.రాముయాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా మార్చి 1న ఆలయంలో గణపతి పూజ, మంటప పూజ, గోపూజ, కంకణ ధారణ, జలాదివానం, హోమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2న కృష్ణుని ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించనున్నట్లు తెలిపారు. 3న విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్ట, అన్నదానం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

బోరుకు పూజ చేస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ వన్నూర్‌బీ

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ తెలిపారు. ఈమేరకు మంగళవారం పట్టణంలోని 14వ వార్డులో తాగునీటి పథకం కోసం బోరు పనులను పూజ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి కమిషనర్ శరత్‌చంద్ర, కౌన్సిలర్ కృప సుజాతమ్మ, వార్డు ఇన్‌ఛార్జి సునీల్‌కుమార్, నాయకులు బింగి కిరణ్, పుల్లా రెడ్డి, వెంకటరామిరెడ్డి, వెంకటరాముడు, ధనంజయ, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

వాల్మీకి కళ్యాణ మండపానికి విరాళం

బొమ్మనహాల్ : రాయదుర్గంలో నూతనంగా నిర్మిస్తున్న వాల్మీకి కళ్యాణ మండపానికి మండల స్థాయి వాల్మీకి సంఘం నాయకులు మంగళవారం వితరణ అందజేశారు. మండలానికి చెందిన కొందమంది నాయకులు, వాల్మీకి సోదరులు కలిసి రూ.12 వేల మొత్తానవ్వ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్దేహాల్ వన్నూరుస్వామి, దర్గాహొన్నూరు, అరేసముద్రం గ్రామాల వాల్మీకి సోదరులు పాల్గొన్నారు.

'జానమద్ది'కి నివాళి

రాయదుర్గం : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రముఖ కవి రచయిత, బ్రౌన్ శాస్త్రిగా పేరుపొందిన జానమద్ది హనుమద్‌శాస్త్రి వర్ధంతిని పురస్కరించుకుని ప్రధానోపాధ్యాయులు పి.వెంకటేష్‌బాబు ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ మన రాయదుర్గం ప్రాంత వాసి అయిన జానమద్ది సిపి బ్రౌన్ గ్రంథాలయం నిర్మాణానికి పునాదులు వేశారన్నారు. అలాంటి ఆయన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాఘవేంద్ర, సోమశేఖర్, గోవిందరాజులు, ఇక్బాల్ పాల్గొన్నారు.

జానమద్ది విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

నవభారత్ పాఠశాలలో నిర్వహించిన సైన్స్ దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని శ్రీచైతన్య పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నగరంలోని ఆదిమూర్తి నగర్ ఎటిపి-8, 9 బ్రాంచ్‌ల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎజిఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రశ్నించడం, పరిశోధించడం, ప్రయోగాలు చేయడం వంటి నైపుణ్యాలను విద్యార్థులు విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల తయారు చేసిన నమూనాలను ప్రదర్శించారు. ఈ కార్యకమంలో ప్రిన్సిపాళ్లు నేత్రావతి, డి.అరుణ్‌కిరణ్, శాంత, అకాడమిక్ జోనల్ కో-ఆర్డినేటర్ తిరుమలేసు, డీన్ గంగాధర్, 1వ బ్రాంచ్ సతీష్, 8వ బ్రాంచ్ డీన్ అరుణ్‌కిరణ్, ప్రైమరీ ఇన్‌ఛార్జి చంద్రకళ, ప్రీప్రైమరీ ఇన్‌ఛార్జి జోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

అలాగే కోర్టు రోడ్డులోని పాఠశాలలో ఏర్పాటు చేసిన జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్ర అధ్యాపకుడు టి.ఫిరోజ్ ఖాన్, ఎజిఎం సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఏటా ఫిబ్రవరి 28న సర్ సివి రామన్ రూపొందించిన రామన్ ఎఫెక్ట్ సందర్భంగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నట్లు వివరించారు. సివి రామన్ గారికి ప్రపంచవ్యాప్తంగా దేశానికి గుర్తింపు తెచ్చిన గొప్ప వ్యక్తి అన్నారు. ఆయన ఆవిష్కరణలను గుర్తించి 1930లో ప్రతిష్టాత్మకమైన నోబెల్ బహుమతి దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తబస్సు, డీన్లు రిషిబాల, అప్పలనాయుడు, ఎఒ గోపాల్, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, సైన్స్ ఎక్స్‌పెమెంటర్స్ శైలజ, సతీష్, అఖిల, మహేష్, నాగవర్ధిని, సావిత్రి, గంగాధర, షే క్షా, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

అలాగే స్థానిక కమ్మ భవన్ సమీపంలోని ఉన్న సి అండ్ ఎం డేస్కాలర్ క్యాంపస్‌లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎజిఎం సుబ్బారెడ్డి, జెఎన్‌టియు రిజిస్ట్రార్ శశిధర్ మాట్లాడుతూ నేటి విద్యావిధానం, అత్యాధునిక జీవన శైలిని పెంపొందించుకోవడంలో శాస్త్ర సాంకేతికత చాలా ఉపయోగపడుతుందన్నారు. ప్రతి విద్యార్థి ఆ రంగం వైపు తమ దృష్టిని మరల్చాలని సూచించారు. అనంతరం విద్యార్థులు తయారుచేసిన నమూనాలను వీక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విశ్వనాథ్, కోఆర్డినేటర్ రాధాకృష్ణ, డీన్ శ్రీనివాస్‌రెడ్డి, సిరాజుద్దీన్, సైన్స్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానిక ఆజాద్‌నగర్‌లో ఉన్న నవభారత్ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల నమూనాలను ప్రదర్శించారు. ఇందులో భాగంగా పాఠశాల కరస్పాండెంట్ నిట్టూరు శశిభూషణ్, ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణి, తదితరులు సీవీ రామన్ జీవిత చరిత్ర, సైన్స్ దినోత్సవంపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.స్థానిక రుద్రంపేట బైపాస్‌లోని శ్రీచైతన్య ఎటిపి-10 బ్రాంచ్‌లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎజిఎం సుబ్బారెడ్డి హాజరై సైన్స్ దినోత్సవ విశేషాలను వివరించారు.

స్థానిక మూడో రోడ్డులోని సాయివిజ్ఞాన్ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా పాఠశాల డైరెక్టర్లు కరుణాకర్ బాబు, ఎంపి శ్రీనివాసులు, ఎంవి చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులు తయారు చేసిన నమూనాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ లావణ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం సిటీ : నగరంలోని నేతాజీ సుభాష్‌చంద్రబోస్ మున్సిపల్ పాఠశాలలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల బౌతిక శాస్త్ర నిపుణులు ఆర్.పద్మ సువర్ణ హాజరై జాతీయ సైన్స్ దినోత్సవంపై అవగాహన కల్పించారు.

ఉరవకొండ : ఉరవకొండ ఎస్ఎల్ఎన్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సైన్స్ అధ్యాపకులు సాకు భాస్కర్ ఆధ్వర్యంలో మంగళవారం సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మండల విద్యాశాఖ అధికారి ఈశ్వరప్ప, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్, తదితరులు సివి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అగస్త్య ఫౌండేషన్ సహకారంతో సైన్స్ ఆవిష్కరణల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య ఎటిపి-9లో నమూనాలను వివరిస్తున్న విద్యార్థులు

గుత్తి : పట్టణంలోని ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘ కార్యాలయంలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రముఖ శాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత సివి.రామన్ చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపి రాష్ట్ర పెన్షనర్ల సంఘం మండల అధ్యక్షులు కె.అబుబకర్, ఉపాధ్యక్షులు స్వర్ణాంబ, కార్యదర్శి రామ్మోహన్, అదనపు కార్యదర్శి జన్నే కుళ్లాయి బాబు, సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ రెడ్డి, కోశాధికారి ఫక్రుద్దీన్, నాయకులు వెంకటేష్, నారాయణరెడ్డి, నారాయణశెట్టి, నాగేశం, చెన్నారెడ్డి, అన్సర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్ : స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళ వారం కళాశాల సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో విజ్ఞాన శాస్త్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక సభ్యులు జగదీష్, కళాశాల ప్రిన్సిపాల్ రఘు రామమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, అధ్యాపకులు ప్రసాద్, కిరణ్, ఉమర్, షరీఫ్, నాగప్ప, రామకృష్ణ, విజయ్‌కుమార్, గోవర్ధన్, సిద్ధప్ప, తదితరులు పాల్గొన్నారు.

సాయి విజ్ఞాన్ పాఠశాలలో విద్యార్థుల నమూనాలను పరిశీలిస్తున్న అతిథులు

పెద్దవడుగూరు : మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో మంగళవారం సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని జడ్పీ ఉన్నత, ఆదర్శ, సరస్వతి, చిత్రచేడు, లక్ష్ముంపల్లి, కిష్టిపాడు, దిమ్మగుడి ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు తయారు చేసిన పలు రకాల ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి.

నార్పల : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల నమూనాలను బీసీ గురుకుల పాఠశాలల జోనల్ ఆఫీసర్ రాజేంద్రకుమార్‌రెడ్డి, డిస్కవర్ అనంతపురం, గ్రీన్ ఆర్మీ అనిల్‌కుమార్ తిలకించారు. అనంతరం రాజేంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుందన్నారు. విద్యార్థుల్లో ఏ ప్రతిభ ఉందో వెలికి తీయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు విద్యార్థుల్లో ఎంతో ప్రతిభ ఉన్నప్పటికీ సరైన అవకాశాలు రాకపోవడం, సౌకర్యాలు లేకపోవడం వంటి కారణాల వల్ల ప్రతిభ వెలికి రావడం లేదన్నారు. అలాంటివారు ఈ గురుకుల పాఠశాలను మంచి వేదికగా చేసుకుని తమలో ఉన్న ప్రతిభను గుర్తించి ఆ వైపుగా అడుగులు వేయాలని సూచించారు. అలాగే మండలంలోని బండ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో విద్యాకమిటీ ఛైర్మన్ శేషానందరెడ్డి అధ్యక్షతన జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు వివిధ రకాల నమూనాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి, జి.లక్ష్మీనరసింహా, సర్పంచి వెంకట్ నారాయణమ్మ, కార్యదర్శి వెంకటరెడ్డి, విఆర్ఒ అమర్నాథ్‌రెడ్డి, పాఠశాల అధ్యాపకులు నరసింహారెడ్డి, రాజశేఖర్, శివశంకర్, విజయభాస్కర్, శ్రీదేవి, కళావతి పి.కాటమయ్య, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నగరంలోని శ్రీచైతన్య, ఉరవకొండ, పెద్దవడుగూరులో విద్యార్థుల నమూనాలను పరిశీలిస్తున్న అధ్యాపకులు, గుత్తిలో సర్ సివి.రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

పాత్రికేయులపై అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలి

పుట్టపర్తి అర్బన్ : కదిరి పట్టణంలో టిడిపి, వైసీపీ శ్రేణుల మధ్య జరిగిన ఘర్షణలను కవర్ చేసేందుకు వెళ్లిన మీడియా ప్రతినిధులపై బనాయించిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఇండియన్ జర్నలిస్టుల యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. జాతీయ కార్యవర్గ సభ్యుడు అయ్యన్న గారి శ్రీనివాసులు, సంతోష్ రెడ్డి, గోపీనాథ్ రెడ్డి సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న పాత్రికేయులపై ఇటీవల దాడులు అధికమయ్యాయని అన్నారు. కదిరిలో పాత్రికేయులపై దాడికి పాల్పడిన సిఐ మధును బాధ్యతల నుంచి తప్పించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిఐపై తగిన చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఓబులదేవర చెరువు : పాత్రికేయులపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని ఓడి చెరువు మండల పాత్రికేయులు స్థానిక తహశీల్దార్ శ్రీధర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కదిరి పట్టణంలో మూడు రోజుల క్రితం సిఐ ఇంటి వద్ద టిడిపి శ్రేణులు చేసిన ఆందోళన కార్యక్రమాన్ని కవర్ చేసేందుకు వెళ్లిన మీడియా ప్రతినిధులను సిఐ మధు నానా దుర్భాషలాడుతూ దాడి చేయాలని పోలీసులకు ఉసిగొలిపారని విమర్శించారు. ఈ ఘటనలో రిపోర్టర్లపై కదిరి సిఐ తమ్మిశెట్టి మధు రివర్స్ కేసులు పెట్టారని విమర్శించారు. , స్థానిక రిపోర్టర్లు షబ్బీర్, సోమశేఖర్, రాము, బాబ్జాన్‌పై పలు సెక్షన్లు కింద కేసు నమోదు చేశారన్నారు. అక్రమ కేసులు వెంటనే తొలగించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు చంద్రశేఖర్ రెడ్డి, షాజహాన్, రంగప్ప, రంగారెడ్డి, ఫిరోజ్, ఫయాజ్ , గోపినాథ్ రెడ్డి, మౌలా లి, ఆనంద్, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

సిఐ సాధించిన సిల్వర్ మెడల్ ఉమ్మడి జిల్లాకే గర్వకారణం

ప్రజాశక్తి బత్తలపల్లి

మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ లో నిర్వహించిన ఫోరెన్సిక్, మెడిసిన్ పరీక్షలలో సిఐ మన్సురుద్దీన్‌కు దక్కిన సిల్వర్ మెడల్ ఉమ్మడి అనంతపురం జిల్లాకే గర్వకారణమని ధర్మవరం సిఐలు సుబ్రహ్మణ్యం, వహీద్ భాష, ఎస్సైలు టీవీ శ్రీహర్ష ప్రదీప్ కొనియాడారు. మంగళవారం బత్తలపల్లి పోలీస్ స్టేషన్లో సిఐ మన్సురుద్దీన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నుండి 52 మంది అన్ని రంగాలకు చెందిన వారు పాల్గొనగా ఆరు అవార్డు దక్కాయని, వాటిలో ధర్మవరం రూరల్ సిఐ మన్సురుద్దీన్ కు సిల్వర్ మెడల్ దక్కడం ఉమ్మడి జిల్లా పోలీస్ శాఖ కే గర్వకారణమన్నారు. సిఐ మన్సురుద్దీన్ మాట్లాడుతూ పోలీస్ డ్యూట్ మీట్లో జరిగిన ఫోరెన్సిక్,మెడిసిన్ పరీక్షలలో తాను మొదటిసారిగా పాల్గొన్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఉఎస్ఐలు ఖాసీం, సోమశేఖర్ మూర్తి, బత్తలపల్లి, పోతుకుంట పోలీస్ సిబ్బంది, సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.